# వాపసి

## ఆర్ఫియస్

నిద్ర లేచాడు మూర్తి. ఆవలించాడు. వాచీ చూసుకున్నాడు.

''పదకొండుం బావే!'' అనుకున్నాడు.

కొంచెం తలనొప్పి ఇంకా మిగిలి ఉన్నట్లనిపించింది. కళ్ళు వాచి ఉన్నాయి.

''వెధవది - విస్కీ త్రాగకుండా ఉండాల్సింది'' అనుకున్నాడు. రాత్రి రెండున్నర దాకా తన గదిలో జరిగిన కాండ తల్చుకున్నాడు. ఆలీ, బాబు, మైక్, చాంగ్, శర్మ, డాక్టర్ మిత్రా - తనూ... రెండున్నర దాకా బంగాళాదుంపల చిప్స్ తింటూ, జీడిపప్పు మింగుతూ, మధ్య మధ్య సాండ్‌విచ్‌లు - అందులో గ్రామఫోను మీద పాటలు! రవిశంకర్ 'ఈవెనింగ్ మెలోడి' నుంచి బెతోఫెన్ 'మూన్ లైట్ సోనాటా' దాకా... ఛలోక్తులు... ఎదురుగా టేబులు మీద మూడు ఖాళీ సీసాలు-- కన్పించాయి.

లేచి నిల్చుని వాటిల్ని తీసి అవతల ఉచాడు.

మరోసీసా - చిన్న బీర్ సీసా కన్పించింది.

అడుగున కొంచెం మిగిలి ఉంది. అదీ అవతల పెట్టాడు. ఎలక్ట్రిక్ హీటర్ మీద కాఫీకి నీళ్ళుంచాడు తర్వాత. దంతధావనం, క్షురకర్మ, ముఖప్రక్షాళనం కానిచ్చాడు.

కాఫీ త్రాగుతూ కూర్చున్నాడు.

''మరో అరవయి గంటలు - తర్వాత...'' అనుకున్నాడు.

తర్వాత...

లండన్ -- పారిస్ -- రోమ్ -- బొంబాయి --సిగరెట్ వెలిగించాడు మూర్తి ఆలోచిస్తూనే...


తర్వాత--

హైదరాబాదు! భాగ్యనగరం! కోటీ! చిక్కడపల్లి!

పన్నెండువేల మైళ్ళు! సప్త సముద్రాలకవతల - భరత ఖండం -

డ్రాయర్లోంచి విమానం టిక్కట్లు తీసుకుని చూచాడు. లండన్‌లో ఇండియాదాకా టిక్కట్లు తయారుగా ఉంటాయి. 'హే' మార్కెట్‌లో.. కాఫీ తాగడం అయిపోగానే సూట్‌కేసులోకి సామాన్లు సర్దడం మొదలు పెట్టాడు. థీసిస్ కాపీలు రెండు... మూడేండ్ల శ్రమఫలితం -- తన్ను ఒక్కసారిగా 'మిస్టర్' నుంచి 'డాక్టర్ మూర్తి'గా మార్చేసి విద్యార్థికుల్లో అగ్రశ్రేణికి త్రోసిన పరికరం ఇది!

ఫోటో ఆల్బమ్ తీసుకున్నాడు... తను రోమ్‌లో, తర్వాత ఇక్కడా తీసుకున్న ఫోటోలు - బోటులో, డెక్ టెన్నిస్



ఆడుతూ... మంచులో నడుస్తూ, ఎండాకాలంలో రంగురంగుల షర్ట్‌లో, వసంత రుతువులో ఎర్రబారిన మేపుల్ చెట్ల ఆకుల మధ్య! స్నేహితులు ... న్యూయార్క్‌లో నయాగరా వద్ద - ఉన్నట్లుండి ఆగిపోయాడు మూర్తి.

ఎదురుగా ఫోటో తనకేసి చూడసాగింది - చక్కటి పెదవులు తన్ను చూచి మందహాసం చేశాయి. ఇంద్ర ధనుస్సు లాంటి నిడుపాటి కనుబొమల క్రింద వెన్నెల చిందుతూ · నీలి కళ్ళు తన్ను పలకరించాయి.

ఆల్బమ్ ఒక్కసారిగా బరువయిపోయింది. అవతల ఉంచేశాడు మూర్తి. మోయలేక... చేతులు కాక, మనసే బలహీనమయిపోయింది. తూలుతూ పోయి పడక మీద కూర్చున్నాడు... మాల... మాల... నవ వసంత సుమలీల...

★ ★ ★

ఆ రోజు తనకింకా ఎంతో జ్ఞాపకం... ఇండియా - కెనడా సంఘంవారి దీపావళి పార్టీ రోజది... తను ఒక వైపు నిలబడి అందర్నీ

అనగనగా ఒక మంచికథ....

చూస్తూ ఉన్నాడు. హిందీ, బెంగాలీ, అరవం వినిపిస్తున్నాయి. తనకు కొత్త ఇంకా.

''హలో'' అని వినిపించింది ప్రక్కన. తిరిగి చూచాడు.

ఆరడుగుల ఎత్తున, స్ఫురద్రూపి, చెయిచాపి కరచాలనం చేశాడు.

''నాపేరు మూర్తి'' అన్నాడు మూర్తి.

''నాపేరు రాయ్... మీది మద్రాసా?'' అన్నాడతను.

''కాదు. నేను హైదరాబాద్ వాసిని.''

''అది నిజాం సంస్థానం కదూ?''

''ఒకప్పుడు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్... మాది అసలు కోస్తా ప్రాంతం.''

''నా కంత పరిచయం లేదు మన దేశంతో... నేనిక్కడ స్థిరవాసం ఏర్పరుచుకున్నాను. పది పన్నెండేళ్ళయిపోయింది.''

''అలానా... '' అన్నాడు మూర్తి. ఎవరో పిలిచారతన్ని.

''క్షమించండి'' అంటూ అతను అవత



లికి పోయాడు.

పార్టీ అయిపోయింది. కార్లు బయలుదే రాయి. మూర్తి బయటికి నడిచి బస్ కోసం బయలు దేరాడు.

''హలో'' అని వినిపించింది ఎవరో పిలవడం. కార్లోంచి ఎవరో పిలుస్తున్నారు. కారు దగ్గరకు పోయాడు. లోపల రాయ్‌గారు న్నారు. ఎవరో ప్రక్కన కూర్చుని ఉన్నారు.

''మేము డౌన్ టౌన్ వెళ్తున్నాము. మీరెక్కడికి వెళ్ళాలి?''

మూర్తి చెప్పాడు.

''మరేం! రండి! అది మాకు దారే... సందేహించకండి!'' అన్నాడు రాయ్. మూర్తి లోపలకు చేరాడు. వెనుక సీట్లో కూర్చు న్నాడు. తలుపు మూసుకోగానే లోపల చీకటి నిండిపోయింది.

''ఆ, మర్చాను... ఈ అమ్మాయి నా కుమార్తె మాల - మాలా, ఇతను మిష్టర్ మూర్తి-'' పరిచయం చేశాడు. మూర్తి ఏదో అన్నాడు వినీ వినపడకుండా. ముందు సీట్లోంచి వెనుదిరిగి ఆ అమ్మాయి చేయి అందించింది.మూర్తి కరచాలనం కావించాడు., కొంత ఆశ్చర్యపోయి.

మన దేశ స్త్రీలు, ఇక్కడ కూడా, కరచాలనం చేయరు పరిచయం చేస్తే. మరి ఈ మిస్ మాల-? కారు వేగంగా పోసాగింది చక్కటి రోడ్డు మీద. దార్లో తన గురించి ప్రశ్నలు వేశాడు రాయ్. ఎక్కడ చదువు తోందీ, పూర్తి పేరూ - మాల నవ్వింది తన పూర్తి పేరు ఉచ్చరించబోయి, రాక - తన చిరునామా...

''ఇవన్నీ అడిగానని అనుకుంటు న్నారా? అది నా అలవాటు. క్రొత్తగా వచ్చిన దేశవాసుల్ని మాఇంటికి అతిథుల్నిగా పిలు స్తాను నేనెప్పుడూ - అంటే - కలుసుకున్న తర్వాతన్న మాట! మాలా, మరి మూర్తిగారి నెప్పుడు పిలుస్తావు?'' అన్నారు రాయ్, చాలా చనువుగా.

''మీరు రేపు సాయంత్రం ఏం చేస్తారు? డాన్సులకు పోతారా?'' అంది మాల.

''నాకు చేతరాదు డాన్స్ - నాకేం ప్రోగ్రాం- లేదు.'' అన్నాడు మూర్తి.

''మరింకేం... రేపు సాయంత్రం ఆరు న్నరకంతా రండి. ఫోంచేసి వెళ్ళండి....'' అన్నాడు రాయ్. మూర్తి ఒప్పుకున్నాడు. తనను ఇంటి దగ్గర దిగబెడుతూ రాయ్‌గారు ఏ బస్సు ఎక్కాల్సిందీ, ఇల్లు ఎలా కనుక్కునేదీ చెప్పారు. అంతసేపూ కారు తలుపు తీసే వుండడం చేత మూర్తికి మాల వైపు చూచే అవకాశం లభించింది. తలుపు మూసుకుంది వెంటనే. చీకటి - మళ్ళీ.

''నమస్తే'' అన్నాడు మూర్తి.

''గుడ్‌నైట్'' అన్నాడు రాయ్. మాల; అద్దంలోనుండి చేయి వూపింది. సగం కత్తిరించిన జుట్టొక్కటే గుర్తుంచుకోగలిగాడు మూర్తి... మరునాడు కాని మూర్తికి మాలను పూర్తిగా, సావకాశంగా, పరీక్షగా చూడ్డం కాలేదు.

మంచి ఎర్రటి రంగు. నిడుపాటి కను బొమలు... లలిత కోమలమైన వ్రేళ్ళు. చక్కటి నవ్వులొలికే పెదవులు.... అన్నిటినీ మించి - ఎప్పుడూ మెరిసే - నీలికళ్ళు - ఆకాశం రంగువి!

''ఆమెకు నీలికళ్ళెలా వచ్చాయి?'' అనుకున్నాడు మూర్తి. తర్వాత గాని తెలియ లేదు తనకు.

మాల తండ్రి పద్దెనిమిదేండ్ల ముందు డాక్టరేట్ కోసం వచ్చిన రెండో సంవత్సరం లోనే మాల తల్లిని వివాహం చేస్కున్నాడు. ఆమె ఫ్రెంచి వనిత - అక్కడ స్థిరపడిపో



యారు ఆమె తల్లిదండ్రులు. ఆరేండ్ల తర్వాత రాయ్ తిరిగి కలకత్తా - స్వగ్రామం వెళ్ళారు.. ఆయనకు అక్కడ వుద్యోగం నచ్చక, భార్య, మాలలతో తిరిగి కెనడాకు వచ్చేశారు. మాలక ప్పుడు అయిదేండ్లు.... తర్వాత - పదేండ్ల తర్వాత మాల తల్లి చనిపోయింది.

మాలకు హిందూదేశం గూర్చి అంతగా తెలీదు. అందుకని రాయ్‌గారు మాలని కెనడా దేశపద్ధతుల్లో పెంచారు. మాలకి బొట్టు పెట్టుకోవడం రాదు. ఆమె అలవాట్లు, బాష, తీరు, అంతా దాదాపు పాశ్చాత్య విధానంతో నిండిపోయాయి, ఒక్క పేరే, కొంచెం హిందూ ఫక్కీ...

ఆ తర్వాత తను ఎన్నోసార్లు మాలతో చాటుగా మాట్లాడడం, తను కొంచెం డాన్సు చేయడం నేర్చుకున్న తర్వాత, ఆమెతో డాన్సులకి, సినిమాలకి వెళ్ళడం జరిగింది. తను గడిపిన మూడేండ్లలో వారానికోసార యినా మాలని చూసేవాడు. రానురాను చూడాలనే వాంఛ పెరిగింది. కొన్ని రోజులకి, ముఖ్యంగా - మూడు నెల్లకి ముందు - చూడలేకుండా తను వుండలేనన్న విషయం తనకి తెలిసి వచ్చింది. కాని - మాల కూడా తనతో బాటు మాట్లాడే సమయంలోనూ, డాన్సు చేస్తున్నప్పుడూ, సినిమాలో మునిగి వున్నప్పుడూ - ఏ భేధమూ చూపేది కాదు. పైగా ఒక్కొక్కసారి తన్ను హేళన చేసేది చిలిపిగా.


''మీరు అచ్చు ఇండియన్లు!'' అనేది. తను జవాబిచ్చేవాడు అంతకన్నా నేరుగా... ''ఆ గౌరవం నాకు చాలు!'' అని. నవ్వేది మాల. సెలయేరు దుమికినట్లు - జలతరంగం మ్రోగినట్లు నవ్వేది! మూడు నెల్లముందు ప్రథమంగా మాల తన్ను ప్రశ్నించింది. ''ఇండియాకు ఎప్పుడు వెళ్ళాలి?'' అని. ''మరో మూడు నెల్లు'' అన్నాడు తను. అదోలా తలూపింది మాల. మూర్తికి అందులో అగుపించని అర్థం తోచింది.

''మళ్ళీ తిరిగి రారు - కదూ?'' అంది మాల.

''బహుశా అంతే కాబోలు... ఉద్యోగం చూసుకోవాలి.... తర్వాత ...''

''తర్వాత పెండ్లి... మీ నాన్నగారేనా మీకు పెండ్లి కుదిర్చేది?'' మాల మాటల్లో వ్యంగ్యం గుర్తించాడు మూర్తి.

''అది మా సాంప్రదాయం, పద్ధతి... సంతానం బాగోగులు వారి వారి తలిదండ్రుల




చేతుల్లో వుండడం తప్పా?'' అన్నాడు తను.

''అలా అన్నానా నేను?'' అంది మాల.

''మరి?''

మాల మాట్లాడలేదు. సంభాషణ 'గొప్పగా' సాగటం లేదని గుర్తించాడు మూర్తి.

''పోనీండి... మీరు పెండ్లికి నన్ను పిలుస్తారా, వస్తాను!'' అంది.

''పన్నెండు వేల మైళ్ళు - రాయ్‌గారికి బాంక్ అకౌంటు చాలా వుందిలా వుంది!''

''మీరు పిలిస్తే తప్పక వస్తాను'' అంది మాల.

మాల మాటల్లో భావం అర్థంకాకపో లేదు మూర్తికి. కొన్ని రోజులుగా తన్ను తానుచాలా పరిశీలనగా ప్రశ్నించుకున్నాడు. తనూ, మాలా, రాయ్‌గారు, ఇండియాలో తన తల్లిదండ్రులు - అందర్నీ మనసులో వుంచుకున్నాడు. కరకుగా అడిగాడు తన్నే. 'మాలని వివాహం చేసుకోవాలని వుంది - నీకు - సరే. కానీ, నీ తల్లిదండ్రులకి తెలపగలవా అది? మీ నాన్నగారేం అవుతారు! అదీకాక, మాల పాశ్చాత్య జీవన విధానంలో తయార యింది, పెరిగింది - ఆమెకు స్త్రీ స్వాతంత్ర్యం, స్వేచ్ఛా - గాలీ, నీరూ... మన దేశంలో అది సాగదు.... కొంతవరకే, ఏదైనా సాగినా... ఆలోచించుకుని నిర్ణయానికి రా!'

తను జవాబిచ్చుకున్నాడు కూడా ఈ ప్రశ్నలకి.. మాల తన ప్రక్కన వుంటే ఈ ప్రపంచం స్వర్గమైపోతుంది.... ఈ మూడేండ్ల లోనూ ఆమె తన జీవితంలో ఒక్కసారిగా వన్నెల నింపింది. కాని - నాన్నగారు... కులం, మతం, సాంప్రదాయాలు.

''కులం, మతం ఎవరిక్కావాలి! మాలలో హైందవ రక్తం కలిసి లేదా ఏం?'' అనుకునేవాడు. - వెంటనే సగం గకత్తిరించిన జుట్టూ, - అంతకన్నా.. నీలికళ్ళూ - నిలి చేవి! నీలి - నీలికళ్ళూ... హిందూ దేశంలో కన్పించనివి! పాశ్చాత్య రక్తపు చిహ్నాలు...

ఆ తర్వాత తను ఎంతగా పోవాలని అనిపించినా మాల ఇంటి వైపు పోలేదు. సాయంత్రం పూట పిచ్చిగా తోచేది. రిదో నది గట్ల మీద, పార్కుల్లో, సినిమా హాల్లో, చీకట్లో గడిపేవాడు.


''నేను చాలా పిరికివాడ్ని... నాకు మాల తగదు!'' అనుకున్నాడు ఆఖరికి.

★ ★ ★

తలనొప్పి ఎక్కువయ్యింది. లేచాడు మూర్తి..... ఇలా ఆలోచనలు వచ్చీ లాభం లేదు. బయలుదేరి మిత్రులందర్నీ చూడ్డం ప్రారంభించాలి. సాయంత్రం ప్రొఫెసర్ మాషీ తన గౌరవార్థం డిన్నర్ ఇస్తున్నాడు. నలుగుర యిదుగురు విద్యార్థులూ, తనూ... రేపు రాత్రి శర్మా, బాబూ కలిసి తనకు 'డ్రింక్స్' పార్టీ ఇస్తారు.... ఎల్లుండి ప్రొద్దున్నే ప్రయాణం. మైక్, శర్మా వస్తారు తనతో వీడ్కోలుకు. మూర్తి కోటు వేసుకుని, గదిలోంచి బయట పడ్డాడు.

★ ★ ★

కస్టమ్స్ పరీక్ష అయిపోయింది. మూర్తి సామాన్లు వెళ్ళిపోయాయి. ''మర్చిపోకూ




డదు సుమా - రోమ్‌లో దిగు - తర్వాత - కైరోలో పిరమిడ్ ఫోటోలు పోస్ట్‌చేయి - ఓ చక్కటి అమ్మాయికి అవి చాలా ఇష్టం - ఆ అమ్మాయంటే - మన కిష్టం -'' అన్నాడు శర్మ నవ్వుతూ... ఇంగ్లీషులో అన్న ఆ మాటలు విని మైక్ నవ్వాడు.

''మరేం లాభం లేదు. మేరియన్‌కు నీవు లక్ష బహుమతులిచ్చినా లాభం లేదు...''

''చూడు! - కాస్త ఆగి చూడరా నాన్నా! నీ కళ్ళముందే వచ్చే శుక్రవారం మేరియన్‌తో 'ఫెకల్టీ డాన్స్'కు రాకపోతే, నీకు బెల్ ఏర్ హోటల్లో పెద్ద కాంబినేషన్ 'పీత్సా' ఇచ్చుకుంటాను - కాచుకో''

ఫ్లయిట్‌కు తయారయింది విమానం.... చెవులు తూట్లు చేస్తూ ఆహ్వానించింది ప్రయాణీకుల్ని. మూర్తి శర్మ చేతిలో పుత్తరం వుంచాడు.

''ఇది పోస్ట్ చేయి. మర్చిపోకు... చాలా ముఖ్యం...'' అన్నాడు.

''నాకు తెల్సులే... ప్రేమ యాత్ర అంత మయిందనేగా ... అంతే నాన్నా, పిచ్చి! మంచి పనే చేశావు! నిజం..... అంతా మర్చిపో! పారిస్‌లో నా పేరు చెప్పి గుక్కెడు షాంపెన్ ఆచమనం చేయి... సర్వపాప పరిహారార్థం! బై - గుడ్‌లక్ -'' అన్నాడు శర్మ.

కరచాలనం చేశాడు మూర్తి, శర్మ, మైక్‌లతో. మైక్ మూర్తిని కౌగలించుకుని చెంపలమీద ముద్దిడుకున్నాడు. ''భగవంతుడు నీకు మేలు చేస్తాడు'' అన్నాడు గ్రీక్‌లో.

మూర్తి చేయి వూపుతూ విమానం వైపు నడిచాడు.

విమానం మరింత విషాదంగా అరిచింది-

★ ★ ★

బాబు గడియారం చూసుకున్నాడు. రెండు యాభై. ''ఈ పాటికి పోస్ట్‌మన్ వచ్చి ఉండాలి. తనకేమయినా వచ్చాయో లేదో? ఒక్కసారి రూముకు పోతే బాగుంటుంది'' అనుకున్నాడు.

ఎదురుగా ఆయిల్ పంపు శబ్దం చేయ సాగింది. మెర్క్యురీ డిఫ్యూజన్ పంపులో పాదరసం చిందులు తొక్కింది. అటూ ఇటూ చూచాడు బాబు. ''సాయంత్రందాకా ఇది కాదు. మరి అంతే కాబోలు...''అనుకున్నాడు విసుగ్గా వి.పి.సి. వేపు చూస్తూ. రికార్డు గుర్రుమంది.

ప్రతి రోజూ ఇలాగే దినానికొకసారి ఆశ శిఖరాలందుకుంటుంది. మరుక్షణం అగాధం. లేదా అంతకు మించిన ఆకాశం. ఒక్క చిన్న కాగితం ముక్క, నాలుగు పంక్తులు ఎంత భేదం తెస్తాయి. తన పర్సుతెరిచి, చూచుకున్నాడు. నాలుగు నెల్ల ముందు తీసిన ఫోటో. తను సూటులో నీటుగా నిల్చున్నాడు. ప్రక్కన తల వంచుకుని, సిగ్గుదొంతరలమధ్య నుంచి చూస్తూ శారద.... బుగ్గన చుక్క.

గాఢంగా నిట్టూర్చాడు. తల్చుకుంటే వెంటనే రెక్కలు కట్టుకుని ఎగిరి పోవాలనుంది. మళ్ళీ, మూడేండ్లకు కాబోలు... తిరిగీ... ఆ క్షణాలు మళ్ళీ.

శారద జాబు వ్రాసి నెల కావస్తోంది! ఎందుకని వ్రాయలేదు? తను ఎంతగానో చెప్పాడు. పల్లెటూరు - యాభై అయిదు నయాపయిసా ఏర్‌మైలు లెటర్లు దొరకవు...తనతో తీసుకు పొమ్మని... మర్చిపోయి ఉంటుంది. మొట్ట మొదట తను వెళ్ళేరోజున తన అడ్రసు వ్రాసి ఇచ్చిన కవరు మీదే వ్రాసింది. తనకు కంఠతా వచ్చు.

''నాకు మీలాగ కవిత్వం వ్రాయడం రాదు. నా జాబులు మీకు సంతృప్తినివ్వలేకపోవచ్చు. మీ ప్రయాణం ఎలా జరిగింది? ఆ రోజు నేను చాలా వంటరిగా అయిపోయాను. మీ ఫోటో చూస్తూ కూర్చున్నాను. మరి, నా ఫోటో మీతో మాట్లాడుతోందా? ఒంటరిగా కూర్చున్నప్పుడు మీరు జ్ఞప్తికి వస్తారు. ఏమిటేమిటో ఆలోచనలు వస్తాయి. అనుకోకుండా కళ్ళంట నీళ్ళు వస్తాయి... కాని అశుభం అని నాకు తెలుసు.''

''మీరు త్వరగా రండి. నాకు మళ్ళీ మీతో మాట్లాడాలని ఉంది అప్పటిలాగా. ప్రతి రోజూ రోజులు లెక్క పెడుతున్నాను. కాని తరగడం లేదు. మీ ఆరోగ్యం జాగ్రత్తగా చూచుకొమ్మని ప్రార్థిస్తు మీరు వ్రాసింది చదివి అన్నయ్య తెలుగులో చెప్పాడు. అంత చలిలో వాళ్ళందరూ ఎలా ఉంటారు?....''

అమాయకత్వం, మమతా, ఆరాధనా - వందల వేల మైళ్ళు దూరం చేయలేని సాన్నిహిత్యం తలపుల్లో చేరువయ్యే మనసు.....

తనసలు పెండ్లి వద్దన్నాడు ఇక్కడికి వచ్చేముందు. అమ్మా నాన్నారూ వప్పుకోలేదు. తను శారద నంతకు ముందెప్పుడో ఓసారి చూచాడంతే. జూన్‌లో పెండ్లి చూపులూ, జులైలో వివాహం, ఆగష్టులో అజ్ఞాతవాసం.....

వాటి మధ్య ఇరవయి రోజులు గగన విహారం. మబ్బుల్లో తిరిగారిద్దరూ. శారదను ఆ కొద్ది రోజుల్లో తను పూర్తిగా అర్థం చేసుకున్నాడు. ఆధునిక సమాజం ఇంకా మసిపూయని హృదయం.... ఆప్యాయతా అనురాగమూ, సౌమ్యతా తప్ప మరేదీ చొరని మనస్సు.

ఆమె పుట్టి పెరిగిన పల్లెటూరి లాంటి స్వచ్ఛమైన శారద!

''మిస్టర్ బాబూ లెటర్సు ఫర్‌యు.'' అన్నాడు తోటి సహాధ్యాయి అలీ.

తను ఇంటి చిరునామా, కాలేజీ చిరునామా రెండూ ఇచ్చాడు. కాని ఎప్పుడూ ఇంటికే వ్రాసేది శారద!

దాదాపు పరిగెత్తుకుంటూ వెళ్ళి చూచాడు.

రెండు ఉత్తరాలు! ఒకటి నాన్నగారి

అక్షరాల్లా ఉన్నాయి!

రెండోది మరింకెవరు! చదువుకున్నాడు త్వరత్వరగా...

''...మీకు వ్రాయటంలో ఆలస్యం అయినందుకు క్షమించవలసిందిగా ప్రార్థిస్తున్నాను. ఇక్కడికి వచ్చేరోజు ఈ జాబులు తెప్పుకోవటం మర్చిపోయాను. అవి వచ్చేసరికి ఇంత ఆలస్యం అయింది. నేను ఆరోగ్యంగా ఉన్నాను. నాన్నగారూ, అమ్మా, అమ్మమ్మా మిమ్మల్ని అడిగారు...''

నెమ్మదిగా నడుముకుంటూ తన రూమువేపు నడిచాడు బాబు. క్షణం పాటు కూడా దృష్టి జాబు నుంచి తీయకుండా. అతని అడుగులు తేలిగ్గా పడ్డాయి....

★ ★ ★

జాబు చదువుతూ బాబు నడిచిపోవడం చూచి శర్మ నవ్వుకున్నాడు.

''ఈ 'గృహస్థు'లకి జాబులు తప్ప మరోటి అక్కర్లేదు!'' అన్నాడు ఫోన్ చేస్తూ.

''హలో, మిస్ ఫ్లీగర్- హలో- గుడ్ మార్నింగ్'' ఇంగ్లీషులో అన్నాడు.

''హలో, షార్మా, ఏమిటి విశేషాలు'' అంది అవతలి కోమల కంఠం.

''మరేముంది..చిన్న వార్త ముందు చెప్పి, తర్వాత అసలు సంగతి చెప్తాను ....నిన్న...''

''అసలు సంగతి చెప్పు ముందు..''

''నీకు తెలీదేమిటీ! వారం రోజులు మనసూ శరీరమూ కరిగేలా శ్రమించిన మాబోటి వారికి మరింకేం కావాలి! కంపెనీ, నైస్ కంపెనీ'' అన్నాడు శర్మ.

''అదా! దానికేం... మీ ఇండియన్లే వరూ దొరకలేదా!''

''ఇండియన్లా! భోజనానికైతే వెడతాను...కాని, వారాంతంలో విహార సమయం మాత్రం స్వదేశీయులతో గడిపినంత ఘోరం హిట్లర్ కూడా చేసి ఉండడు!''

''అదుగో..నేను జెర్మన్ అనా, అలా అంటావు!'' చిరుకోపం సంప్రదించింది.

''నోనో... కాకపోయినా నీవు ప్రపంచం మీద దండయాత్ర సాగిస్తే ఎదురు నిలిచే యోధుడెవడున్నారని! నేనే ఇండియాకు రాజునయి ఉంటే అది నీ చేతుల్లో ఉంచేసేవాడ్ని!''

''చాల్చాలు..మరి అసలు సంగతి చెప్పవుగా!''

''విను ...శుక్రవారం...ఎల్లుండి ...సాయంత్రం.. వీలవుతుందా?''

ఇంత సానపెట్టాను ఆఖరికి తెగదేమో?

''ఎల్లుండా? నాకు వీలుకాదేమోనని భయంగా ఉంది. మా బంధువులు ఆల్బర్టా నుంచి వస్తారు.. నీవు ముందుగా నాతో చెప్పాల్సింది...''

ఒక క్షణం మాట్లాడలేదు శర్మ.

''నెరజాణవి నీవు!'' అన్నాడు తెలుగులో ఫోనులోకి.

''ఏమిటీ? నీ భాషలో మాట్లాడకు..''

''మరేం లేదు... ప్రయత్నించలేవా? అన్నాను'' అన్నాడు శర్మ వెంటనే.

''సారీ...మరో సారి...''

''నీ శ్రాద్ధం నీవు కాకపోతే...'' అనుకున్నాడు.

''ఒకే. బై.''

''బై''

ఏదో ఒకటి.. కొంచెం మళ్ళీ హస్తసాముద్రికం, కొంచెం హిందూ మతం గురించీ, కొంచెం వర్ణాశ్రమ ధర్మాలూ, కాశీ నగరం, గాంధీ మహాత్ముడూ - చదువుకోవటం మంచిది పోయేముందు...

ఈ తెల్లవాళ్ళకి మనకంటే ఎక్కువ తెలుసునని తను తెలుసుకున్నాడు మొదటి వారంలోనే. అందుకనే ఎక్కడయినా చిక్కుపడితే అది ఆపద్ధర్మ సూత్రాల్లో వ్రాశారని తప్పించుకోవచ్చని కూడా అర్థమయింది.

''అంటే'' అనేవారు పాపం వాళ్ళు.

''దాన్ని తర్జుమా చేయలేము. సంస్కృతం''

వచ్చే సంచికలో....

అమెరికా యువతిని పెళ్ళాడిన

తెలుగు యువకుని విలక్షణ జీవిత చిత్రణ

## ''నీటిలో కాగితం పడవ''

(పెద్ద కథ)

డా. ఎ. సుబ్బారావు

''ఒకే. బై...'' ఫోను ఉంచేశాడు.

ఆలోచించాడు. మారియన్ మధురంగా తప్పించుకుంది.

మరి, శుక్రవారం సాయంత్రం ఏం చేయాలి తను? ఫోను తీసుకున్నాడు. నెంబరు డయల్ చేశాడు.

''హల్లో, నేను ...శర్మని..క్లారా? హలో..''

''అవును..''

''నేను ...జ్ఞాపకం ఉందా?''

''ఉండకేం.... నా చేయి చూసి చెప్తానని తప్పించుకున్న ఇండియన్‌వి...''

''ఓ.. దానికేం... ఆఁ! ఎల్లుండి సాయంత్రం డాన్స్ ఉంది. నిన్ను అడుగుదామనుకున్నాను.''

''చేయి చూస్తావా?''

''దానికేం అన్నానుగా.. కాని దక్షిణ ఏం ఇచ్చుకుంటావు?''

''ఏం కావాలి?''

''ఎల్లుండి సాయంత్రం చెబుతాను... మరి, సాయంత్రం ఏడు గంటలకి వస్తాను... ఒకే?''

ఆ పేరే ఉచ్చరించడం రాని వారికది నిజంగానే తోచడంలో తప్పేముంది?

''ప్రపంచంలో దేన్ని గురించో ఓ దాన్ని గురించి తెలీని వాళ్ళుండబట్టే నా లాంటి వాళ్ళు బ్రతికి పోతున్నారు!'' అనుకున్నాడు శర్మ..గది వేపు నడుస్తూ.

''శర్మాజీ, లెటర్స్'' అన్నాడు బాబు, ఆనందంగా.


''నీ ముఖం చూస్తే తెలీదూ.. మీ ఆవిడేమంటుంది! ప్రాణేశా, వెంటనే తిరుగు టపాలో వచ్చేయి అందా!''

బాబు నవ్వాడు జాబు అందిస్తూ శర్మకి. శర్మ జాబు తీసుకున్నాడు. చిరునామా కొడిగీకినట్టుంది.

''ఇది ప్రేమలేఖే..నాకు తెలుసు...తమ్ముడో బావగారో, లేకపోతే ఖచ్చితంగా నాన్నగారో ఓ వందరూపాయలు పంపమని వ్రాసి ఉంటారు'' అనుకున్నాడు చదవబోతూ.

''వూ! తమ్ముడే...అయితే ఫర్వాలేదు..చిన్న డిమాండు!''

''మేమంతా క్రికెట్ టెస్ట్ మాచికి




పోవాలనుకుంటున్నాము. ఇంకా నెలరోజులుంది. నీవు నాకు ఇరవయి అయిదు రూపాయలు పంపించు. మా ఫ్రెండ్ దగ్గర తీసుకుంటాను సమయానికి రాకపోతే.. అమ్మా నాన్న బాగా ఉన్నారు. అన్నయ్యకు మళ్ళీ ట్రాన్స్ఫర్ వచ్చేలా ఉందిట. నాన్నగారు అదే అన్నారు... నీవు పంపిన మంచు ఫోటోలు చాలా బావున్నాయి. స్టాంపులు పంపించు... నాన్నకు చెప్పకు...''

''క్రికెట్ - స్టాంపులు - ఫోటోలు.. ఫరవాలేదు.. అయిదు డాలర్లతో సరిపుచ్చాడు...''

తనిక్కడ బంగారం పోగు చేస్తున్నాడని వాళ్ళ అభిప్రాయం...సగానికి సగం ఎగిరిపోతోంది తిండికి. తను వంట చేసుకోలేదు బాబు, ఆలీ లాగా.. ఎవరు చేతులు కాల్చుకుంటారు? తలనొప్పి. తినడం ఫర్వాలేదు.. అన్నీ కడుక్కుంటూ కూర్చోవాలి. తర్వాత.. అంట్లు! గదిలో జర్నల్ మీద తలపెట్టుకూర్చున్నాడు.. ఈ జాబు లెప్పుడూ ఇంతే.. అన్నయ్యకు బదిలీ...అంటే మళ్ళీ మొదలు... ఈసారి తను ఉండడు... నాన్నగారి వందా పదిహేను రూపాయల్లో తమ్ముడూ, అమ్మా, నాన్నగారూ, చెల్లాయీ, వచ్చేపోయే బంధు సముదాయం, ఇత్యాదులు.

''భగవాన్, త్వరగా నాలుగు రిజల్ట్సు వచ్చేలా చేయి! ఈ పనేదో ముగించుకుని వెళ్తాను అమెరికాకి.. చేతిలో కొంత డబ్బున్నా మిగుల్తుంది అక్కడ.. నాన్నగారికి నెలకో వందయినా పంపవచ్చు..'' అనుకున్నాడు.

ఎన్ని డాన్సులూ చేసినా ఎంత బీరు నీళ్ళు త్రాగినా, ఈ బాధ్యత వదలదు. మరో విషయాన్ని అనుకుని బాధలు మర్చిపోవడం, నీడనుంచి తప్పించుకోవడం లాగా జన్మలో వీలుగాదు. ఇదిలా సాగాల్సిందే ప్రతి క్షణం-

తను వచ్చిన క్రొత్తలో ఎంతసేపూ ఇంటి పిచ్చే చుట్టుకునేది తనకు. ఈ క్రొత్త భోజనం, రుచీ పచీ లేని తిండి - సాయంత్రం ఆరు గంటలు కొట్టక మునుపే డిన్నర్.-

అన్నిటికంటే ముఖ్యంగా స్నేహితులు. ప్రతి శుక్రవారం సాయంత్రం ఏమీ తోచేది కాదు. ఎంతసేపని చదువుకుంటూ ఒంటరిగా కూర్చోడం? ఆ తర్వాత ఒకసారి ఇంటర్నేషనల్ హౌస్కు పోయాడు తను. అక్కడ ప్రతివాడూ 'డాన్స్' చేయడం నేర్చుకుంటున్నారు. ఎవర్తో మాట్లాడడం?

తను ఓ మూలగా ఏ పత్రికో చేతపుచ్చుకుని అంత మందిలో మరింత ఒంటరిగా కూర్చోవడం. దినాలు గడిచేకొద్దీ తను ఈ పద్ధతికి అలవాటు పడలేదని తెలిసి వచ్చింది.

ఆ తర్వాత - తనూ డాన్స్ నేర్చుకోవడం మొదలెట్టాడు.

ప్రప్రథమంగా సిగ్గేసేది తనకే. ఎవరో తెలీని యువతుల్ని నృత్యాని కాహ్వానించడం తనకు చాలా కష్టంగా ఉండేది. తర్వాత డాన్సు చేసేంత సేపూ ఎక్కడో చూసేవాడు. నెమ్మదిగా తన్నుతాను పరిచయం చేసుకోవడం, పేరూ వూరూ చెప్పుకోవడం, ఆ తర్వాత మాట్లాడడం వచ్చాయి.

రెండు మూడు నెల్లయేసరికి తనలో మార్పు తనకే తెలిసి వచ్చింది. తను డాన్సు బాగా చేయడమే కాక అత్యంత సహజంగా ఎదుటి యువతితో ఛలోక్తులాడడం, 'కాఫీ'లకు ఆహ్వానించడం, ఆ తర్వాత టెలిఫోనులో గంటల కొద్దీ ఏదేదో వాగడం అలవాటయ్యాయి.

తనకు తెల్సిన కొంచెం హస్త సాముద్రికం వగైరాలు తన 'పలుకుబడి'కి బాగా తోడ్పడ్డాయి.

ఇన్ని జరిగినా ఒక్కోరోజు అనుకోకుండా 'ఘోరంగా' తయారయేది.

నాన్నగారినుంచో, అన్నయ్యో, ఎవరో ఒకరు ప్రేమలేఖలు వ్రాసేవారు. తనూ, అవసరం కాబట్టీ, మరొలా అనుకుంటారని, నెలకో ముక్క వ్రాసి పడేసేవాడు. పోను పోను అదో అలవాటయ్యింది. మొదటి వారంలో జాబు గీకి పడేయటం.. పెద్ద వ్రాసేదేమీ లేకపోయినా.

తను ఇంటి బాధ్యతలు తప్పించుకుంటున్నాడా అంటే అదీ నిజం కాదు. తను ప్రతి నెలా ఇరవయ్యో ముప్పయ్యో డాలర్లు పంపించుతూనే ఉన్నాడు. 'దేశ సేవ' అనేవాడు తను ఎవరన్నా అడిగితే...

తను రెండేళ్ళలోనూ బాగా మారిపోయాడు. సిగరెట్లు తను వారానికో పాకెట్టు త్రాగేది ఇప్పుడు దినానికొకటయింది. మద్యం ముఖం చూడని తను ప్రస్తుతం ''యాభై సెంట్ల కోకో''- బీర్కు మారుపేరు - ప్రతి రోజూ త్రాగకుండా ఉండలేక పోతున్నాడు. ఎంత పని ఉన్నా తన టెలిఫోను ద్వారా ఎవరో ఒక తెలిసిన 'గర్ల్'ని పార్టీకో, డాన్సుకో 'మూవీ' కో తీసుకు పోతున్నాడు పిలిచి.

''నేను ఇండియాకు తిరిగి పోగలనా?'' అనుకునేవాడు.

ఆ ప్రశ్నే అతన్ని వేధించేది.

ఈ స్వేచ్ఛా, ఈ వాతావరణం తనకు నచ్చాయి. తన్నెవరూ అడిగేవాడు లేడిక్కడ. తనెవ్వరికీ జవాబులు చెప్పక్కర్లేదు -

తిరిగి ఇండియాకు పోతే?

మళ్ళీ అదే ఇల్లు... అన్నయ్యా, పిల్లలూ నాన్నగారు...త మ్ముడు..

బాధ్యత! తను దేన్ని సహించలేడో అవి - శర్మ లేచి నిల్చున్నాడు - దాహంగా ఉంది.. రూంకు పోయి కొంచెం గొంతు తడి చేయందే పనిసాగదు.

దుస్తులన్నీ వేసుకుని నడిచాడు బయటికి..

బయట చల్లగా ఉంది. జోరుగా చలి గాలి ముఖం మీదకు కొట్టింది. ఇలా ఎన్నాళ్ళో సాగదు. ఈ కల అంతం కాకమా

నదు.

ఒక్కసారిగా దివినుండి భువికి తనంత తనే పడాల్సి వస్తుంది. తను ఎంత ప్రయత్నించినా, వద్దను కన్నా వీలుకాదు.

చలిగాలికి చేతులు బిగుసుకు పోసాగాయి. చెవులు ఎర్రబారి నొప్పిపుట్ట సాగాయి.

కళ్ళలో నీరు చేరింది. విదిలించుకున్నాడు వాటిని కోపంగా.

''చలి - చలిగాలికి నీరు కార్తోంది - అంతే!'' అనుకున్నాడు వేగం హెచ్చింది - గాలి మరీ ఉధృతమయింది-

★ ★ ★

డాక్టర్ మిత్రా పైప్ పొగాకుతో నింపసాగాడు. ఎదురుగా టేబిల్ మీద పుస్తకాలు చిందర వందరగా పడివున్నాయి. ''వీటన్నిటినీ సర్దాలి రేపు'' అనుకున్నాడు పొగ పీల్చుతూ. ప్రతిరోజూ అంతే. ఒక క్షణం గది అంతా చెక్కు చెదరకుండా శుభ్రంగా వుంటుంది. మళ్ళీ చూసేసరికి పుస్తకాలు, దుస్తులు, కాగితాలు, గదినిండా వుంటాయి. వాటిని మళ్ళా యథాస్థానానికి చేర్చటం ....... మళ్ళీ మొదలు.


ఈ పది సంవత్సరాలూ అలాగే కదూ గడిచింది? పదేండ్లు! పంతొమ్మిది వందల యాభై రెండు! ఆగష్టు నెల! ఆ రోజు తను అనుకోలేదు. పదేండ్లు ఆలా పరదేశంలో నివసిస్తానని...మూడేండ్లు... మహా అయితే నాలుగేండ్లు అనుకున్నాడు అతను...

తర్వాత ఏ బొంబాయిలోనో, మద్రాసులోనో మంచి ఉద్యోగం దొరకగానే 'స్థిరపడి' పోదామని అనుకున్నాడు.

డాక్టరేట్ చేతికొచ్చేసరికి నాలుగయిదేండ్లయింది. ఆ తర్వాత సంవత్సరం పాటు లండన్... తర్వాత మూడేండ్లు అమెరికా...

ఈలోగా పరిస్థితులూ, తనూ చాలా మారిపోయారు... అరవయిలో తను ఓ నెల పాటు తిరిగి వచ్చాడు. దేశం అంతా మంచి వుద్యోగం కోసం చూసాడు. బొంబాయి, మద్రాసు, కలకత్తా...ఎన్నో ఉద్యోగాలయితే ఉన్నాయి. గవర్నమెంటులో కొన్ని, పరిశ్రమల్లో చాలా...కాని తనకు నచ్చలేదు.

తన కాళ్ళ మీద నిలబడటం, తన అభిప్రాయాలూ ఆశయాలూ స్వేచ్ఛగా వెలిబుచ్చడం అక్కడ వీలు కాదని తెల్సుకున్నాడు. ప్రభుత్వోద్యోగాల్లో చిక్కులు తెలిశాయి. పై అధికారికి తను లోబడి వుండాలన్న విషయం రుచించ లేదు తనకి... అదీకాక దేశం




వదిలి, ఉన్నత విద్యాభ్యాసం కోసం వేలకొలదీ మైళ్ళు పోయి, వంటరిగా విచిత్రవాతావరణంలో సంవత్సరాల కొద్దీ గడిపిన వారికి స్వదేశంలో గొప్ప సత్కారం ఏమీ లభించదని అర్థమైంది....

ఎక్కడ చూసినా కూపస్థ మండూక విన్యాసం. అంచేత తను తిరిగి పరదేశాల్లో ప్రవాసం మొదలెట్టాల్సి వచ్చింది.

ఇక్కడయితే ఒక్క విషయం మంచిదిగా తోస్తుంది. సామర్థ్యం వున్నంత వరకూ కుల మత విచక్షణ లేకుండా పైకి రావచ్చు... తను ఇష్టం వచ్చిన శాఖలో పరిశోధన చేయవచ్చు.

కానీ...

ఎన్నాళ్ళిలా? మరో రెండేళ్ళు జరిగిపోతే తను ఏదో ఒకటి నిర్ణయించుకోవాల్సిన దినం రానే వస్తుంది.

పుట్ట పెరిగిన ప్రాంతం వదిలి మరో దేశవాసి కావటం - పైప్‌లో మంట చల్లారిపోయింది.

తనకు ముప్పైఅయిదేండ్లిప్పుడు..... పాత ఫోటోలు తిరగేస్తే తప్ప తను పదేండ్ల ముందెలా వుండేవాడో జ్ఞాపకం రాదు.

కళ్ళలో కాంతి చచ్చిపోయింది....నీడలే మిగిలాయి....జుట్టు కూడా తన ఆశల్లేగే రాలిపోయి దువ్వెన అవసరం తీరిపోయింది....

చాలా రోజుల్నుంచి స్వదేశం గూర్చి ఆలోచనలే రావటం లేదు.

''రేపు మాంట్రియల్ కు పోవాలి.... ఆ ఉద్యోగం దొరకాలి -'' అనుకున్నాడు.

ఈ విషయం మీదే తనకూ, మూర్తికీ వాదన ప్రతిరోజూ జరిగేది.

''మనం నాలుగురోజులిక్కడ గడిపి, వెంటనే భారత రాజధానిలో కాలరెత్తుకు తిరగాలంటే వీలుకాదు. మనలాంటి వాళ్ళే, మన కన్న మంచి వాళ్ళే ఎందరో ఉన్నారు అక్కడ. వారిని తోసి రాజని మనకు విమానం దిగక ముందే భారతీయు లందరూ నెత్తిన కిరీటం ఉంచుతారనుకోవడం సబబు కాదు'' అనే వాడు మూర్తి.

''మరి ఇన్ని రోజులు, ఇన్ని కష్టాలు పడి తల్లి దండ్రులకూ, ఆప్తమిత్రులకూ, భార్యాబిడ్డలకూ దూరం అయి సాధించిందానికి విలువే లేదంటావా? భారతీయుడు ఫలాని విధంగా అంతర్జాతీయ గౌరవం సంపాదించిం తర్వాత దానికి మన దేశం ఏ విధంగా ప్రతిఫలం ఇస్తుంది! ముష్టి నాలుగువందలురూపాయలు! నీ నెత్తిన ఒకడు, వాడిపైన మరొకడు, వాడిపైన మరో పెద్ద మనిషి! ఇదంతా చూస్తే వారికి తెలిసిందంతా న్యూటన్ పుట్టక ముందున్న విషయాలు!''

''మరి నీకేం కావాలంటావు? పోగానే యూనివర్శిటీలో ప్రొఫెసర్ కావాలంటావా?''

''అలా అనను - కాని పడిన శ్రమకు తగిన ప్రతిఫలం ఇవ్వమంటాను. దేశానికి నేను సేవచేయాలని అంటావు..కాని దేశం నాకేమి ఇవ్వగలదో ఆలోచించు! నా గౌరవానికి, నా శక్తికీ సామర్థ్యానికి తగిన పదవి ఆశించడం దేశద్రోహం కాదు కదా!'' అనే వాడు తను.

''నిజం. కాని - ఒక్కటి మాత్రం చెప్పగలను.మనం అదృష్టవంతులం. ఎలాగో ఇక్కడకు వచ్చి ఈ పశ్చిమ నాగరికతా

ఫలాన్ని రుచిచూడగలిగాం. ఇక్కడ సామర్ధ్యాని కిచ్చిన ప్రతిఫలం మన దేశంలో దొరకదు. మనం అంత స్థాయికింకా రాలేదు. మన తాహతు, శక్తీ, పెరిగినంతగా మన దేశమూ మొత్తంమీద పెరగలేదు... ఈ రెంటికీ సామ్యం కుదిరేదాకా ఇంతే...''

''అంటే నీ ఉద్దేశ్యంలో మనకూ, అక్కడే కూర్చున్న వాళ్ళకీ భేదం లేదు.''

''ఓ విధంగా అంతే..కానీ ఇలా చూడు. మనం మన దేశానికి ఎక్కువ సేవ చేయగలం. మన దేశానికి మనలాటి వాళ్ళు కావాలి...పదవీ అధికారం కాక ఆ తృప్తి ఉంటే చాలు మనకి.''

''అబ్బో! నా తృప్తి మరో వేపు ఉంది - నేను ఏ దేశానికి చెందినా నా మేధస్సు మానవాళికోసమే ఉపయోగిస్తుంటాను! చాలా!''

తన మాటల్లో వ్యగ్యం గుర్తించిన మూర్తి వాదన నిలిపేవాడు.

మూర్తి అలాగే అన్నాడు. అలాగే చేశాడు.

తను అలా చేయలేదు.

నా తాహతూ, సామర్ధ్యమూ వినియోగించుకోలేని చోట - స్వదేశమైనా సరే - ఉండకూడదు.. అది తన్ను తానే చిన్నబుచ్చుకోడమే కాక తను పడిన శ్రమనే వ్యర్థం చేసినట్లవుతుంది.

డాక్టర్ మిత్రా పుస్తకాలన్నీ సర్దసాగాడు. రేపు మాంట్రియల్ ఉద్యోగం దొరికిందంటే - దొరుకుతుంది - తనకా క్వాలిఫికేషన్‌లన్నీ ఉన్నాయి. ఈ దేశంలో పౌరుడిగా తను స్థిరపడి పోవడం ఖాయం. పైపులోంచి పొగ దట్టంగా లేచింది.

★★★

డాక్టర్ రాయ్ చాలా రోజులుగా మాలలో ఖేదం గమనించాడు - వెళ్ళేముందు మూర్తి తన్ను చూడలేదు. కొన్ని రోజులకు ముందే తనకు కన్పించడం మానేశాడు. పని తొందర అనుకున్నాడు తను.

మాల కూడా మూర్తి విషయం అడిగితే ముభావంగా సమాధాన మిచ్చింది.

ఆ రోజు మాలకు వచ్చిన ఉత్తరం మూర్తిదే అని తనకు బాగా అనుమానం. చదివీ చదవక ముందే చించిపారేసింది మాల - తను అడగలేదు. మాల చెప్పలేదు ఎవరు, ఏమిటీ అని.

''నా స్వార్ధం కోసం అనాలోచితంగా



ఇక్కడ స్థిరపడిపోయాను. కాని మాల విషయం ఆలోచించనే లేదు. నేను ఈ సమాజంలో మాల స్థానం ఏమిటి? భారతీయునికీ, పాశ్చాత్య యువతికీ జన్మించిన ఆమెని వివాహం 'చేసుకోవడానికి' తను ఎవ్వరికి అనుమతి ఇవ్వగలడు? మూర్తి లాగే ఏ భారతీయుడూ ధైర్యం చేయలేదు. మరి ఇక మాలతో బాటు నా వంశం అంతమై పోతుంది. స్వచ్ఛమైన కాయస్థ రక్తం పల్చనై పూర్తిగా మారిపోతుంది.''

''మాలా...'' పిలిచాడు రాయ్.

మాల లోపల్నుంచి వచ్చింది. కూర్చోమన్నాడు రాయ్ ప్రక్కన. దగ్గరగా కూర్చుంది మాల.

''మాలా, ఈ వేసవిలో ఇండియాకు పోదామనుకున్నాను. ఓ రెండు నెల్లు...మర్చిపోయానంతా...కానీ మిత్రులూ, బంధువులూ ఉన్నారు. ఏమంటావు?''

మాల మాట్లాడ లేదు.

ఇండియా ..తను ఏనాడో మర్చిపోయిన 'జన్మ' స్థలం..కథల్లాగే విచిత్రమైన దేశం.

కాని తను పోలేదు. ఆ అవకాశం జారిపోయింది. ఆ రోజే.

''నేను పిరికివాడ్ని మాలా నాకేం కావాలో బాగా తెలుసు నాకు. కాని అందుకు కావలసిన త్యాగ బుద్ధి నాకు లేదు. బహుశా నాకు మా పురాతన నియమాల్ని ధిక్కరించే ధైర్యం, శక్తీ లేవనుకుంటాను. ఉండి ఉంటే ఈ ఉత్తరం కాక నేనే నీ చేతుల్లోపడి ఉండేవాడిని. ఇంతకన్నా ఏం వ్రాయగలను. నన్ను క్షమించు. నీకు భగవంతుడు ఆనందం, సంపదా, సౌభాగ్యం ఇస్తాడని ఆశిస్తున్నాను -''

చిరిగి పోయిన కాగితం ముక్కలు గాల్లోకి ఎగిరి పోయినా, ప్రతి అక్షరం, పలుకూ తన మనస్సులో ముద్రితమై పోయాయి.

''ఏమిటమ్మా, ఆలోచిస్తున్నావు?'' అన్నాడు రాయ్. ''ఏం లేదు. ఈ వేసవి సెలవుల్లో నేను ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాను. నీకు రాబర్ట్ తెలుసుగా ...వాళ్ళ కంపెనీలోనే.. అతనే ప్రయత్నిస్తానన్నాడు.. అసలు ముందే నీతో చెబుతామని..''

డాక్టర్ రాయ్‌కి మిగతా ఏమీ వినపడ లేదు. ఎప్పుడో యుగాల వెనుక లీలగా విన్పించిన ఘోష మెదిలింది మనస్సులో -''వందే మాతరం'' అని.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక: 24-4-64: సౌజన్యంతో)

## రచనా సమీక్ష




కథకి కావాల్సిన ఇతివృత్తాన్ని జీవితం నించి సమకూర్చుకోవడం యీ రచయితలకు తెల్సు - అయితే మనసుకు హత్తుకునేలా, మరింత మెప్పించేలా చేయగల కథారచనకు కావాల్సిన శైలినీ శిల్పాన్నీ మరింత అధ్యయనం చేసి సమకూర్చుకుంటే యీ రచయిత! మరిన్ని కథల్ని అందివ్వగలరనే ఆశవుంది.

1990లో ప్రచురించబడిన యీ కథా సంకలనంలో పద్మవ్యూహం, పరిష్కారం లేని కథ, అద్దం మీద ఆవిరి, డాగు, ప్రేమ గురించిన కథ మొదలైన పధ్నాలుగు కథలు న్నాయి.

> 1/8 క్రౌన్: 134 పేజీలు: వెల: 20రూ. ప్రతులకు డా.కె. గంగాధరరావు, పి.4- నార్త్ కేంపస్; ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్నం - 530 003. (లేదా)
> డా. ఎ. సుబ్బారావు, ప్రొఫెసర్, ఇంజనీరింగ్ సైన్స్ డివిజన్, యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్‌సిన్, 53141 (యు.ఎస్.ఎ.)

ఇందులోని 'ఆలోచించు' ఆలోచింపజేసే కథ. ఓటీలు ఇవ్వడం లేదనీ, ప్రమోషన్లు రావటం లేదనీ తను విధిగా చేసే పనినే నిర్లక్ష్యంగా చేసే బ్యాంకు ఉద్యోగీ; ఎదుటి అవసరాలనైనా గుర్తించక డెత్ సర్టిఫికేట్ కోసం కూడా తిప్పే స్టేట్ గవర్నమెంట్ గుమస్తా; గౌరవాభిమానాల్నీ; మంచితనాన్నీ పక్కన పెట్టేసి బతికే స్నేహితులూ; ఎన్నేళ్ళనించో ఏజీన్సీ ప్రాంతంలోనే ఉపాధ్యాయుడిగా వుండిపోయి రిటైరయ్యాక బయటకొచ్చిన రాఘవరావులో ఆలోచనల్ని రేపుతారు. చివరికి నాగరిక ప్రపంచంలో తను యిమడలేడని తెల్సుకుని తిరిగి ఏజెన్సీ ప్రాంతానికే జేరతాడు.

అమెరికాలో నివసించే భారతీయులు జీవితాలన్నీ ఆనందమయం అనుకునే వారి కోసం రచయిత సృష్టించిన మధ్యతరగతి అమెరికా జీవితం ''సోపాన పతం' కథ. ప్రేమలు ఫలించక పోయినా తాము మాత్రం మోసపోలేదనీ, విధే తమను వేరు చేసిందనీ భావించిన ప్రేమికులు పదేళ్ళ తర్వాత కల్సుకుని నిజాలు తెల్సుకున్నాక కూడా ఒకరినొకరు ఎలా మోసం చేసుకుంటారో చెప్పిన కథ 'ప్రేమ శాశ్వతం' మనసుపడ్డ ప్రియుడు పరిస్థితులతో రాజీపడి ముందుకొచ్చి పెళ్ళిచేసుకుంటానన్నా మనం 'మంచి స్నేహితులుగానే మిగిలిపోదాం. కులం తర తరాలనించీ మనలో జీర్ణించుకుపోయింది. దాని నుండి మనకి స్వాతంత్ర్యం కావాలి.' అని అతని చుట్టూ పద్మవ్యూహాన్ని సృష్టించే సరోజ కథ 'పద్మవ్యూహం'.

ఇందులోని చాల కథలు నిత్యం మన జీవితాలలో ఎదురయ్యే సామాజిక సమస్యల నించి తీసుకున్నవే. కథల్లో చాలా చోట్ల రోజుల, సంవత్సరాల సంఖ్యలు చెప్పేటప్పుడు అక్షరాలకు బదులు అంకెలు వాడ్డం (ఉదా: నాలుగైదు రోజులు పోయాక అనే బదులు 4,5 రోజులు పోయేక అనడం వంటివి) పాఠకుడిని కాస్త యిబ్బంది పెడతాయి.

—శివెంసీ